క్లుప్తంగా

కుడా వైస్ చైర్మన్‌గా అదితి సింగ్



కడప కార్పొరేషన్: కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) వైస్ చైర్మన్‌గా ప్రస్తుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు వైస్ చైర్మన్‌గా ఉన్న వైఓ నందన్ సీడీఎంఏ డీడీగా బదిలీ అయిన నేపథ్యంలో ప్రభుత్వం జేసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో నేరుగా అడ్మిషన్లు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో నేరుగా ప్రవేశాలు (ఏపీ ఐసెట్–2024) కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలోని డీఓఏ కార్యాలయంలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లుతో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజు వెంట తెచ్చుకోవాలన్నారు. ఏపీ ఐసెట్ –2024 ఎంట్రెన్స్ రాసి అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు హాజరుకావాలని సూచించారు.

మహ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలి



బార్మీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: మహ్మద్ ప్రవక్త మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. గురువారం క్రిష్టా సర్కిల్‌లో హోటల్ షాహీ దర్బార్ ప్రొప్రైటర్ ఆజం ఆధ్వర్యంలో బార్మీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ఫాతేహా నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, వలీవుల్లా హుస్సేనీ, షఫీ, గయాజ్, పాకా సురేష్, జమాల్‌వలీ పాల్గొన్నారు.

నేడు కడప ప్రభుత్వ వైద్య కళాశాల కాలేజ్ డే

కడప అర్బన్ : కడప ప్రభుత్వ వైద్య కళాశాల కాలేజ్ డేని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కళాశాల స్పోర్ట్స్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిమ్స్ మాజీ డైరెక్టర్ సిద్ధప్ప గౌరవ్, గౌరవ అతిథులుగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జీవీ రమాదేవి హాజరవుతున్నట్లు తెలిపారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ కే వాణి, సూపరింటెండెంట్ జీజీ హెచ్ కడప డాక్టర్ ఎం.సురేశ్వర రెడ్డి, సూపరింటెండెంట్ ఎస్ఎస్ హెచ్ కడప డాక్టర్ ఆర్ వెంకటరాముడు, సూపరింటెండెంట్ ఐఎంహెచ్ కడప డాక్టర్ టీ. శారద, వైస్ ప్రిన్సిపల్ జీఎంసి కడప డాక్టర్ వై విజయభాస్కర్ రెడ్డి వ్యవహరిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కాలేజ్ డే సందర్భంగా ఆటల పోటీలు, క్రీడా పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ కె.ప్రకాష్ బాబు హాజరవుతున్నట్లు తెలిపారు.

హిందీ భాష విలువ తెలియాలి



మాట్లాడుతున్న రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ మనోజ్ శంకర్

కడప కల్చరల్ : దేశ జాతీయ భాషగా ఉన్న హిందీ విలువ తెలియాలని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ మనోజ్ శంకర్ అన్నారు. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ సెప్టెంబరు 14 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన హిందీ పక్షోత్సవాల అనంతరం గురువారం కార్యాలయ ప్రాంగణంలో బహుమతి ప్రదాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎఫ్ కమిషనర్ మనోజ్ శంకర్ మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. మరో కమిషనర్ గౌరవ్ మహల్వాల్, అసిస్టెంట్ డైరెక్టర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ ప్రాంతాల వారికి హిందీ భాష అనుసంధానం చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిందీ భాషలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మా.. భవానీ.. కరుణించు తల్లీ..



బాల పోలేరమ్మ ఆలయంలో ప్రధాన ఆకర్షణగా అమ్మవారి మట్టి విగ్రహం



దీక్షాబంధన అలంకారంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి

- ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- విద్యుద్దీప కాంతులతో వెలుగుతున్న ఆలయాలు

కడప కల్చరల్: అమ్మలగన్న అమ్మ.....ముగ్గురమ్మల మూలపుటమ్మ....చాలా పెద్దమ్మ....మాయమ్మ జగన్మాతకు ప్రణమిల్లుతున్నాను....నన్ను, నా కుటుంబంతోపాటు లోకంలోని ప్రజలందరినీ చల్లగా చూడాలని మరీమరీ ప్రార్థిస్తున్నానంటూ అమ్మవారి ఆలయాల్లో భక్తులు మనసారా ప్రార్థనలు చేశారు. ఆలయాలు ఉత్సవ కళను సంతరించుకున్నాయి. నిలువెత్తున బంగారు కాంతులతో ధగధగ లాడుతున్న అమ్మవారిని దర్శించుకుని తన్మయులయ్యారు.

● కడప నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.30 గంటలకు ఆలయాలలో ప్రత్యేక పీఠాలు ఏర్పాటు చేసి అమ్మవారిని కళ్లుచెదిరే అలంకరణలో కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులిచ్చారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● స్థానిక చిన్నబెస్తవీధిలోని బాల పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి దీక్షా బంధన అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో 12 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని విశేషంగా అలంకరించి భక్తుల దర్శనం కోసం ఉంచారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు మెయిన్‌రోడ్డు వరకు బారులు తీరారు. బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు.

● గడ్డిబజారు శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామిని శ్రీ కోదండ రామునిగా అలంకరించారు. హనుమప్పవీధిలోని శ్రీ భద్రావతి భావనా రుషి ఆలయంలో అమ్మవారిని దీక్షా బంధన అలంకారంలో కొలువుదీర్చారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

● స్థానిక అమ్మవారిశాలలో దీక్షా బంధనం అలంకారం చేశారు. పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్య వైశ్య సంఘం, దసరా ఉత్సవ కమిటీ చైర్మన్ పరిటాల వెంకట రమణ, సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శైలిపుత్రిగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అర్చకులు పిడతల గోపాల కృష్ణశర్మ విశేష పూజలు నిర్వహించారు.

● నగరంలోని నబీకోట శ్రీ రామలింగచౌడేశ్వరీదేవి ఆలయంలో మూల విరాట్‌తోపాటు ఆలయం వెలుపల ప్రత్యేక వేదికపై అమ్మవారిని కొలువుదీర్చారు. అదేవిధంగా నాగరాజుపేట, ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీమాత ఆలయంతోపాటు ఇతర 15 ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.



దీక్షా బంధన అలంకారంలో శ్రీ నడివీధి గంగమ్మ



దీక్షా బంధన అలంకారంలో శ్రీ బాలపోలేరమ్మ



శైలపుత్రిగా శ్రీ విజయదుర్గమ్మ



దేవుని కడపలో తిరుచ్చి అలంకారంలో దేవదేవుడు, అమ్మవారు



దీక్షా బంధన అలంకారంలో శ్రీ కామకోటి కళాంబదేవి



శ్రీ కోదండరామునిగా లక్ష్మిసత్యనారాయణస్వామి

విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలి

ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ



కడప డివిజన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి వైయస్సార్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్. రమణ అన్నారు. గురువారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసి, మరొక నెల రోజులు గడువిచ్చి బిల్లు కట్ట మంటుందన్నారు. అంటే మొత్తము రెండు నెలల గడువు వినియోగదారునికి ఇస్తుందని, విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దని తెలిపారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. మొండి బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీచేసి నిబంధన ప్రకారం వారి మీటరు శాశ్వతంగా తొలగించి, కోర్టులో దావా వేయడం ద్వారా వసూలు చేయాలన్నారు. నెలవారి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. లో ఓల్టేజీ సమస్యలు రాకుండా తగినన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు. లైన్ల వెంబడి తిరిగి మరమ్మతులు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు అడ్డువచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను అరికట్టాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరి చేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి సేవ్యా నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, ఏఓలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య తప్పెట

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన, పరిశోధన, విస్తరణ అనే ప్రధాన సూత్రాలను త్రికరణ శుద్ధిగా అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ కడప బెటాలియన్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ నాగేశ్వరప్ప, విశ్రాంత స్టెప్ సీఈఓ డాక్టర్ ఎం. రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధారాణి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా, తిరుమల శ్రీవారి కల్యాణం లడ్డూను, పట్టు వస్త్రాలను విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్‌కు అందజేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలు తక్షణమే ఉపసంహరించాలని ఏపీ రైతు సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, దస్తగిరి రెడ్డి, సీఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, నాగ సుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చర్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ప్రైవేటీకరణ ఆపాలని గత కొన్ని నెలలుగా విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ పోరాటం సాగిస్తున్నా, ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతూ మోడీ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకే ఫ్యాక్టరీని దారదత్తం చెయ్యడానికి కంకణం కట్టుకుందని విమర్శించారు. మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేటీకరణ పనుల్ని వేగవంతం చేయడం దారుణమన్నారు. జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి చివరి ఆయకట్టు వరకు పంట కాలువలు పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, సుబ్బయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మద్దిలేటి బాదుల్లా, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పి శివారెడ్డి, రైతు సంఘం నాయకులు గోపాలకృష్ణయ్య, చిన్న సిద్దయ్య, బాలచంద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి, యానాదయ్య కార్మిక సంఘం నాయకులు రామకృష్టారెడ్డి, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ పిల్ల కుమారస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు గాంధీనగర్ విద్యార్థులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కడప మండలంలో మొదటి స్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్ప కుమారి తెలిపారు.

గురువారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనను పెంపొందించుకుని సమ సమాజాన్ని నిర్మించాలన్నారు. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి మంచి సేవలందించాలని అన్నారు. విద్యార్థులలో సృజన పెంచడానికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఆ పోటీలలో కూడా ప్రతిభ చాటాలని ఆమె ఆకాంక్షించారు.

నగరంలో భారీ వర్షం

కడప నగరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి అధికంగా ఉన్నప్పటికీ సాయంత్రం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాత్రి 7 గంటలకు మొదలైన చిన్నపాటి వర్షం క్రమంగా ఊపందుకుంది. సుమారు గంటకు పైగా పెద్ద ఎత్తున కురిసిన వర్షంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండు, చిన్నచౌకు, అప్సర సర్కిల్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. –కడప రూరల్





కడప నగరంలో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం



కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో..

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులుగా ప్రకటించింది. కడప జిల్లాలో ఉన్న ప్రైవేటు పాఠశాలలలో కళాశాలలలో క్లాసుల పేరుతో విద్యాసంస్థలు నడుపు తున్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన విద్యాసంస్థలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులను నిర్వహించడం తగదు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర విద్యాశాఖ అన్ని యాజమాన్య పాఠశాలలకు దసరా సెలవులను ప్రకటించిందని, అయినా నారాయణ స్కూల్స్ యాజమాన్యం మాత్రం అక్కడక్కడ పాఠశాలలను నిర్వహించిందని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ గడ్డంరాజు పేర్కొన్నారు. దీంతోపాటు నారాయణ బ్రాంచు టీచర్లకు వర్క్‌షాపు నిర్వహిస్తున్నారన్నారు. వర్క్‌షాపులకు రాని వారికి జీతాలను కట్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రైతులతో కలిసి వరిపంటను పరిశీలిస్తున్న అంకయ్యకుమార్, ఏఓ సురేష్ రెడ్డి

కడప అగ్రికల్చర్: చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఊటుకూరు ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్ సూచించారు. గురువారం కడప మండల పరిధిలోని మోడమీదిపల్లె గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ తెగులు ఆశించిన వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకుని పంటలను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం పంటపొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మెహతాజ్, పావని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.30 లక్షలు చెక్కు అందజేత



హోంగార్డు కుటుంబానికి రూ. 30 లక్షల చెక్కును అందచేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

కడప అర్బన్: హోంగార్డు కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును ఎస్పీ హర్షవర్ధన్‌రాజు గురువారం అందజేశారు. కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో విధులను నిర్వర్తిస్తూ జూలై 6న రామాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో హోంగార్డు పి. ఆంజనేయులు నాయక్ (హెచ్.జి 2083) మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆయన కుటుంబానికి రూ. 30లక్షలను చెక్కు రూపంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డు తల్లి పి. ధార్మికి అందచేశారు. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. పోలీసుశాఖ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ



ప్రణవ్‌రెడ్డికి ట్రోఫీ, సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు



అమీనా

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన ప్రణవ్ రెడ్డి, అమీనా చదరంగం పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచారు. అక్టోబర్ 2వ తేదీన చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన 5వ సీసీఏ అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ ఓపన్ చెస్ టోర్నమెంట్‌లో వీరు పాల్గొని టాప్–10స్థానాల్లో నిలిచారు. అండర్–9 బాలుర విభాగంలో ప్రణవ్‌రెడ్డి 6వస్థానంలో నిలడంతో పాటు ఫిడే ర్యాపిడ్ రేటింగ్‌లో 1422 పాయింట్లు సాధించాడు. అండర్–9 బాలికల విభాగంలో అమీనా 8వ స్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు.